నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ చెంగిచెర్ల ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, కమలానగర్, విశ్వం విహార్‌కాలనీ, సుమ రెసిడెన్సీ, గురుఎన్‌క్లేవ్, అయోధ్య కాలనీ, భగత్ సింగ్‌నగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11 కేవీ బుద్ధానగర్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్, వరంగల్ హైవేలలో కరెంటు ఉండదని ఏఈ హరినాథ్ సగ్గు వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పంచమి మహోత్సవ వేడుకలు

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ అనంతసరస్వతీనగర్‌లోని జ్ఞాన సరస్వతీ అమ్మవారి దేవాలయంలో సోమవారం శ్రీ పంచమి మహోత్సవ వేడుకలు జరుగుతాయని ఆలయ చైర్మన్ కె.హరీష్, ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు అభిషేకం, 9 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం, 11 గంటలకు సరస్వతీహోమం, రాత్రి 7 గంటలకు పల్లకీసేవ, 8 గంటలకు ఊయల సేవ జరుగుతుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న అశోక్‌కుమార్‌గౌడ్

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌కు చెందిన తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు బుర్ర అశోక్‌కుమార్‌గౌడ్‌కు 'సోలార్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ' అవార్డు లభించింది. గత 25 ఏళ్ల నుంచి సోలార్ ఇండస్ట్రీ కోసం నిరంతర కృషిని గుర్తించి తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జీఎం ప్రసాద్, టీజీఎస్ పీడీసీఎల్ సీజీఎం చక్రపాణి చేతుల మీదుగా ఆదివారం తెలంగాణ టూరిజం భవన్‌లో అశోక్‌కుమార్‌గౌడ్ అవార్డు అందుకున్నారు.

మాజీ డిప్యూటీ మేయర్‌కు సన్మానం




మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా 17వ డివిజన్ హనుమాన్‌నగర్ కాలనీ ప్రెసిడెంట్ రాజసింహ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌ను ఘనంగా శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జంగేష్, శ్రీహరి, నక్క చందు, పొన్నం చిరంజీవి, వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మదర్సాలో హిఫ్జ్- ఏ- ఖురాన్ సభ



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జామియా రియాజుల్ ఇస్లాం మదర్సాలో హిఫ్జ్-ఏ-ఖురాన్ సభను ఆదివారం ఘనంగా నిర్వహించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ వేడుకలకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్ అనంతరెడ్డి, నాయకులు ఇర్ఫాన్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సందడిగా తరంగ్ వేడుకలు



వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థుల ప్రదర్శన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ బస్‌డిపో, బోడుప్పల్ శ్రీ చైతన్య హైస్కూల్లో తరంగ్ 20వ, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ప్రజాకవి గాయకుడు, సినీగేయ రచయిత సురేందర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. సామ అశోక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సామ శోభారాణి, డైరెక్టర్ సామ అభిషేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతల చెరువా..? కాలుష్య కాసారమా!

• రోగాల బారిన పడుతున్న స్థానికులు • దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



చెంగిచర్లలో చింతల చెరువు పరిస్థితి



చెరువులో కలుస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధి చెంగిచర్లలో ఉన్న చింతల చెరువు మురుగునీటితో నిండి కాలుష్యాన్ని వెదజల్లుతోంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి వచ్చే మురుగునీరు చెరువులోకి వచ్చి చేరుతోంది. చెరువులోకి చేరిన మురుగు దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు అవుట్‌లెట్ లేకపోవడంతో అక్కడే నిలిచిపోతున్నాయి.

ప్రకటనలకే పరిమితమైన హామీలు..

◆ గత ఎన్నికల్లో నాయకులు చెరువుకు నిధులు కేటాయించి అవుట్‌లెట్ ద్వారా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ కేవలం ప్రకటనలకే పరిమితం కావడంతో స్థానిక కాలనీ ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

మురుగు, వ్యర్థాలతో నిండిన చెరువు..

◆ చెంగిచర్లలోని చింతల చెరువు బఫర్, ఎఫ్‌టీఎల్ కలిపి మొత్తం 43.33 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. కొంత చెరువు కబ్జాకు గురి కాగా.. ప్రస్తుతం చెరువు 23.12 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెంగిచర్లలో గడిచిన 10 ఏళ్లలో పలు కాలనీలు వెలిశాయి. వాటిలో మౌలిక వసతులైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. దీంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు ఈ చింతల చెరువులో వచ్చి చేరుతోంది.

దిగువ ప్రాంతానికి అవుట్‌లెట్ లేదు..

◆ చెరువు నుంచి దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు అవుట్‌లెట్ లేకపోవడంతో చెరువులో మురుగు నీరు కలుస్తోంది. మురుగుతో పాటు ఇతర వ్యర్థాలు ఉండటంతో చెరువు చుట్టు పక్కల భరించలేని దుర్వాసనతో వెదజల్లుతోంది. దీంతో స్థానికులు రోగాల భారిన పడుతున్నారు.

నిలిచిపోయిన పనులు...

◆ చెంగిచర్లలో చింతల చెరువు వద్ద ఎస్ఎన్‌డీపీ నిధులు రూ.110కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఫ్లడ్ వాటర్ క్లోస్ట్ ఛానల్, మురుగు కాల్వల నిర్మాణ పనులకు 2022 ఫిబ్రవరి 2న అప్పటి ఐటీమంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఆ పనుల శంకుస్థాపనకు రూ.25లక్షలు ఖర్చుచేసి ప్రారంభించారు. మరో రూ. 25 లక్షలతో పెద్ద కాల్వను తవ్వి పూడ్చి వేశారు.

జీవనాధారం కోల్పోయిన 60 కుటుంబాలు..

◆ చింతల చెరువులో ప్రతి ఏటా ముదిరాజ్ కులస్తులు 2లక్షల చేప పిల్లలను వేసి వాటి పెంచుకుని జీవనాధారం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం చెరువులో మురుగునీరు చేరడంతో కాలుష్యం వెదజల్లుతోంది. కొంత మంది వ్యర్థాలను తీసుకొచ్చి చెరువులో పారవేస్తున్నారు. ఈ కాలుష్యం వల్ల చేపలు చనిపోతున్నాయి. ఇలా చనిపోవడంతో 60 కుటుంబాలు జీవనాధారం కోల్పోయి రోడ్డును పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని చెరువులోకి మురుగునీరు చేరకుండా, అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసి బయటకు పంపించాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.3.5కోట్లతో అవుట్‌లెట్ పనులపై ప్రచారం..

కాంగ్రెస్ పార్టీకి చెందిన మేయర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత చింతల చెరువు నుంచి దిగువ ప్రాంతానికి రూ 3.5 కోట్లతో అవుట్‌లెట్ పనులు చేపడుతున్నట్లు గ్లోబల్ ప్రచారం చేశారు. చివరికి ఎలాంటి పనులు చేపట్టలేదు. స్థానిక ప్రజలకు మాత్రం సీఎం రిలీఫ్ ఫండ్స్ నుంచి నిధులు తీసుకొచ్చి పనులు చేపడతామని చెబుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారుడికి అందజేస్తున్న మాజీ మేయర్

మల్కాజిగిరి: మల్కాజిగిరికి చెందిన నరహరికి ప్రభుత్వం నుంచి వచ్చిన సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ రూ.60 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కంటే ఎక్కువగా పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అభిప్రాయపడ్డారు. నాయకులు ఎస్ఆర్.ప్రసాద్, వెంకటేష్‌యాదవ్, పార్థసారధి, సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్‌కు చెందిన వ్యక్తికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును ఆదివారం స్థానిక మాజీ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి, మాజీ మేయర్ అమర్‌సింగ్ చేతుల మీదుగా లబ్దిదారుడు రాంరెడ్డికి రూ.20,500 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా అనేక మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన



నృత్య ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కల్పతరు మ్యూజిక్ అకాడమీ శిష్య బృందంచే నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణేషా, పంచరత్న, అన్నమయ్య కీర్తనలు, భజన, త్యాగరాజ కృతులు, నీరజాక్షీర్తన, పూజ వైష్ణవి తదితర అంశాలను శాన్వీ, శర్మదా, అక్షర, సంజన, సాహితి, అనూష, హిమబిందు, హిమవర్షిత, మహిత దర్శిని, చార్వీ తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

వైభవంగా మల్లన్న స్వామి కల్యాణమహోత్సవం



మల్లన్న స్వామి దర్శనం



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధి మల్లికార్జున నగర్‌లోని మల్లన్నస్వామి దేవాలయంలో ఆదివారం మల్కాజిగిరి శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణమహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం బోనాల సమర్పణ, అగ్నిగుండం, గొలుసులు తెంపుట, పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్‌లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు, స్థానిక నేతలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పరుపుల గోదాంలో అగ్నిప్రమాదం



అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేయడంతో వ్యాపించిన పొగ

ఉప్పల్ : ఉప్పల్‌లోని పరుపుల గోదాంకు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ భగాయత్ శిల్పారామం రోడ్డులో 'మార్ఫీ కంఫర్ట్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో మహ్మద్ ఇస్మాయిల్ అనే వ్యక్తి మరో భాగస్తుడితో కలిసి గత కొన్నేళ్లుగా పరుపుల గోదాంను నడుపుతున్నాడు. ఆదివారం కావడంతో కొనుగోలుదారులు కంపెనీకి నేరుగా వచ్చి పరుపులు తీసుకెళ్తుంటారు. సాయంత్రం కావడంతో కంపెనీలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 3 ఫైర్ ఇంజిన్లతో దాదాపుగా 2 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ సీఐ ఎలక్షన్‌రెడ్డి, ఇతర పోలీసులు పరిస్థితులు చక్కబెట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సరస్వతి అక్షరాభ్యాసం

రామంతాపూర్ : నేడు చిన్న చెరువు గ్రౌండ్‌లో సరస్వతి పూజ సమితి ఆధ్వర్యంలో సరస్వతి దేవిపూజ, చిన్నారులకు అక్షరభ్యాసం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని సమితి ప్రతినిధులు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణి హాజరవుతారని పేర్కొన్నారు.

గణపతి ఆలయంలో వసంత పంచమి పూజలు

అల్వాల్: కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో ఆదివారం వసంత పంచమి సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో మూల మంత్ర హోమం, సరస్వతిదేవీ హోమం, అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



బోడుప్పల్: యూసఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగిన 'నేషనల్ ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్' కరాటే పోటీల్లో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. రుషి స్కూల్ విద్యార్థులు కుమార్, వెంకటేష్ పసిడి పతకాలు, స్టీఫెన్, హనిస్, అభిషేక్ రజతం సాధించినట్లు కరాటే మాస్టర్ నంద ప్రసాద్‌యాదవ్ వెల్లడించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తి రిమాండ్

ఉప్పల్: రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లో పట్టపగలు ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలు అమృతమ్మ మెడలో నుంచి బంగారు గొలుసులు ఎత్తుకెళ్లిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృతమ్మ అనే వృద్ధురాలు నివాసం ఉంటున్న బస్తీలోనే మల్లికార్జున్ (19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. మల్లికార్జున్ తరచూ.. ఆమె ఇంటికి మనుమడి కోసం వస్తుంటాడు. యథావిధిగా వచ్చిన అతడు ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన డీఐ రామలింగారెడ్డి సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి గొలుసును రికవరీ చేసినట్లు పోలీసులు వివరించారు.

కాన్‌క్లేవ్ ర్యాలీతో యువతలో నూతన ఉత్తేజం

ఉప్పల్: యువతలో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు ఐ ఫోకస్ ఆధ్వర్యంలో ఆదివారం వినూత్నంగా ర్యాలీ నిర్వహించారు. యూత్ కెరీర్‌తో ప్రారంభమైన వేడుకలు యువతలో కొత్త ఆశలను రెకెత్తించేలా ఈ ర్యాలీని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మిషన్ సమన్వయ కర్త వాసుదేవశర్మ, పారిశ్రామిక వేత్తలు, సామాజిక సేవకులు, వృత్తి నిపుణులు పాల్గొన్నారు.

వార్షిక క్రీడోత్సవాల ముగింపు వేడుకలు



రామంతాపూర్ : అరవింద్‌నగర్‌లోని విశ్వశాంతి హైస్కూల్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న వార్షిక క్రీడోత్సవాల ముగింపు వేడుకల్లో పరేడ్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ముగింపు కార్యక్రమానికి హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలన్నారు. క్రీడల్లో శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ గిరి, స్కూల్ డైరెక్టర్ వెంకటేశం, ప్రిన్సిపాల్ రూపారాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరువ..

అల్వాల్: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో కృషి చేయడం ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ జీకే కాలనీలోని ది ఇండియన్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, చంద్రశేఖర్, ఎస్ఆర్.ప్రసాద్, శంకర్, రాజు, ఇందిరా, యాదగిరి పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌కు సహకరించండి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: స్వచ్ఛ భారత్ అమలుకు కాలనీ సంక్షేమ సంఘాలు సహకరించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆదివారం విష్ణుపురి కాలనీలో పర్యటించిన ఆయన ఇటీవల చేపట్టిన యూజీడీ ప్యాచ్‌వర్క్స్ పనులను పరిశీలించారు. కాలనీలో ఉన్న కొన్ని ఇళ్లు వివాదంలో ఉన్నాయని, వాటి వద్ద చెత్త, చెదారం పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు వారి వివరాలు సేకరించి జీహెచ్‌ఎంసీకి అందజేయాలని కోరారు. అవసరమైతే జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటుందన్నారు. మూర్తి, పవన్, రవి, రాంమోహన్‌రావు, సోమయాజులు, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్లాలి



స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కోదండరాం

అల్వాల్: మచ్చబొల్లారంలోని ఆర్చిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కోదండరాం హాజరై వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఫోన్‌లో ఆటలు కాకుండా ప్లే గ్రౌండ్‌లోనే ఆటలు ఆడించాలని, వ్యాయామం వంటివి ఇప్పటి నుంచే అలవాటు చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రవి, స్కూల్ ప్రిన్సిపాల్ కవిత, మేనేజర్ ధర్మేంద్ర, జోనల్ హెడ్ రవినాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేదిక గణితం పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



బోడుప్పల్: విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేదిక గణితం పోటీల్లో చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని సిర్పి దివ్య ద్వితీయ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ పరీక్షలు ఎదుర్కొనే విధంగా ప్రత్యేక తర్ఫీదును ఇస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు పోటీ తత్వాన్ని నెలకొల్పి తద్వారా గెలుపు స్ఫూర్తిని ఇస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ నీలిమా, వేదిక మాస్టర్ రామారావు విద్యార్థిని దివ్యను అభినందించారు.

'లక్ష డప్పులు, వేయి గొంతులు' జయప్రదం చేయండి



ఉప్పల్ హరిజనవాడలో డప్పులు మోగిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఉప్పల్: 'లక్ష డప్పులు వేయి గొంతులు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివారం ఉప్పల్ హరిజన బస్తీలో ఎమ్మార్పీఎస్ నేత తోకట నరేష్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు డప్పులు మోగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాదిగల చిరకాల వాంఛ నెరవేరే సమయం ఆసన్నమైందని, మందకృష్ణ మాదిగ నేతృత్వంలో నగరంలో నిర్వహించ తలపెట్టిన 'లక్ష డప్పులు వేయి గొంతులు' బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రామచందర్, అశోక్, పంగ ప్రణయ్, విజయ్, ఈరెంటి విజయ్, బాకారం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేది ఏమిలేదు'

మల్కాజిగిరి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి నర్సింగరావు విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం బీహార్, ఢిల్లీ ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను సిద్ధం చేసిందన్నారు. ఎన్నికల దృష్టి తప్పా.. ప్రజా సంక్షేమంపై దృష్టి సారించలేదన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యాదగిరి, క్రిష్ణమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని శ్రామికనగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మౌలాలి డివిజన్ పరిధిలోని శ్రామికనగర్‌లో ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేసిన శ్రామికనగర్ కాలనీ ముఖద్వారాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కాలనీ అభివృద్ధికి పార్కు స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించి ఇవ్వాలని శ్రామికనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రణాళికాబద్ధంగా పార్కు స్థలం అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అమీరుద్దీన్, భాగ్యనందరావు, సందీప్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మహ్మద్ గౌస్‌భాయ్, అబ్దుల్ హమీద్, కొంతం శ్రీనివాసరావు, హేమంత్ కుమార్, అబ్దుల్ రహమాన్, షేక్ కరీం, కొండయ్య, రాంరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి